ఈవారం కథ

# కాటుక మెరుపు

టి. రాజేశ్వరి

16/9/90





మా పుల్లో చిక్కి, ఊహల్లో ఎదిగి నా గుండె గుహల్లో వొదిగి, భావాలకి సొగసై, నా కుంచెల గీతల్లో అందానివై, నా చిత్రాల్లో దాగి మౌనరాగాలాపనతో ఏకాంతంలో పలకరిస్తూ, నా దరిద్రాన్ని, దౌర్భాగ్యాన్ని రోజులో క్షణమైనా దూరం చేస్తూ, వీళ్లంతా ఏర్పరచిన విషవలయాల్లోంచీ దాటించి మహజగత్తుకి లేవనెత్తేందుకే నా ఇంటికి వచ్చావని నా నమ్మకం.

కానీ ఈలోకం నిన్ను నీలాపనిందల పాల్జేసి గెంటడమే గొప్ప ధ్యేయంగా పెట్టుకుని నిన్ను కాదంది, నా ఇంట వద్దంది.

నువ్వో, వీళ్ల అజ్ఞానాన్ని, కోపతాపాల్ని క్షమిస్తూ, చిర్నవ్వుతో వాళ్లని జయించి ఈ చీకటి గుహలోంచి వెలుగులోకి, నీ లోకంలోకి మళ్లీ నువ్వలా వెళితే, నీ అడుగుజాడలైనా, నువ్విచ్చిన రాగలహరైనా మార్పుతేవాలని వీళ్లల్లో ... ప్చ్ ... అంతా నా పిచ్చి ...

నువ్వు నా లోకంలోకి వచ్చిన రోజు మర్చిపోలేనేమో! ఆ సాయంత్రం నీరెండలో ఆవైపు వచ్చాను. ఎవ్వరూ లేరు. కనుచూపుమేర రోడ్డంతా ఖాళీగా ఉంది. చెట్లనీడలు వెలుగు నీడల తివాసీ పరిచాయి. ఏ స్వప్న జగత్తులోకో వచ్చినట్టుంది నాకైతే. చిగురుటాకుల్లో సూరీడు మిలమిలా మెరుస్తున్నాడు.

చెట్ల చాటునుంచీ ఎవరో పిలుస్తున్నట్లు అనిపించింది. ఆగి గమనిస్తే ఎవరూ లేరు. గాలికి ఎండుటాకులు రాలి రాలిపడుతున్నాయి. కానీ, ఎక్కడో కనిపించీ కనిపించక ఎవరో పిలుస్తున్నట్టే భావన.

చీకట్లు కమ్మే వేళకి నేతిరిగి వస్తుంటే జారిపోతున్న వెలుగును చీకటిపొర తాకేంతలో నీ సౌందర్యం రాగమై పిలిచింది. ఎన్నాళ్ళుగ్గా ఈ అడవిలో నిర్మానుష్య ఎడారిలో ఎలా ఉన్నావో?! నిన్ను ప్రేమించే చిత్రకారుడి కోసం వేచి ఉన్నావనే ఇప్పటికీ అనుకుంటున్నాను.

ఆ చీకట్లో నీ పాట వెలుగులో తన్మయత్వంలో గది చేరాను. ఇన్నాళ్ళుగ్గా ఒక్క చక్కటి గీతకి నోచుకోని కాన్వాసు మీద, నీ భావాన్ని, రాగాన్నీ నింపుకుని, సౌందర్యాన్ని అనుకరిస్తూ కుంచె కదిలింది. కానీ ఆ మెరుపేది? ఏది ఆ సొగసూ? తగనంటూ కుంచె మొక్కింది.

ఎన్నాళ్ళ శ్రమించానో తెలీదు. పగలూ రాత్రీ ఎలా గడిచాయో గుర్తించలేదు. నీ సమాధిలోంచీ తేరుకునేసరికి ప్రపంచం గుర్తించేటంతటి కళ నాలో పెల్లుబికింది.

ఆ సమయంలో చుట్టూరా లోకం పోకడ తెలీనే లేదు. నా వాళ్ళ సైతం విసుక్కుంటున్నారు. నీ ధ్యానంలోంచి లేచేసరికి ఛీత్కరించుకుంటున్నారు వీళ్లంతా. అంతా నీ వల్లనేనని అంటున్నారు. నేను భరించలేను. నా చిత్రం ... కాదు ... నా ప్రాణం ... వారికి అర్థంగాబోతే అర్థం లేనిదేనట!? పోనీ నువ్వు చెప్పొచ్చుగా ... వోహ్ ... నీకు మాటలు రావాయే ...!

గతంలో నాకూ మాటలు తెలీదు. నీ మనోహరత్వంలో, ధ్యానంలో ఉన్నా నేను.

ఎవరో అన్నారు — మీ బొమ్మలు మీ గదికే పరిమితమైతే ఎట్లాగని. నిజమే. కానీ అర్థం చేసుకుని ఆదరించేవారేరి? అయినా అవి నా కోసమే. రోడ్డునబోయే ప్రతీవారూ తోచక వచ్చి వెక్కిరించడానిక్కాదు గదా!?

కానీ నేను లేనిసమయం జూసి నువ్వు నా ఇంట ఉంటే భరించలేని వారంతా కలిసి ఎగ్జిబిషన్ పెట్టారు. ఇంట్లో ఏమీతోచని ఓ పెద్దమనిషి నిన్ను కొనేశాడు.

నేను తిరిగి వచ్చి చూస్తే నువ్వులేవు. కాన్వాసూ లేదు. అంతా శూన్యం. కుడివేపు గోడకి తగిలించిన పూర్తిగాని బొమ్మ గాలికి కదులుతోంది. గదంతా గాలించినా నీ జాడేలేదు. నన్ను విడిచి ఎలా వెళ్లావో తెలీక ఏడ్చాను. తల బాదుకున్నాను. కుంచెలో ఓ మూలగా కుర్చీలో పడున్నాయి. కాయితాలూ పెన్నులూ చిందరవందరగా పడున్నాయి.

ఎవరొచ్చారో, ఏం జేశారో, ఏమో ... తను మాత్రం లేదు ... కిటికీ తెరిచి ఆ రాత్రి చీకటి చీలుస్తూ చూశాను. దూరంగా ఇంట్లో దీపాలు తప్ప తన జాడేలేదు. ఎవరో నవ్వుకుంటున్నారు. వాళ్లనడిగితే? అడిగి ప్రయోజనం? మళ్లీ తనొస్తుందా?! వొట్టి కల మాత్రమే ...

మరుసటి రోజు తెలతెలవారకముందే నువ్వు దొరికిన వేపు వచ్చాను. పరుగులాంటి నడక .. కాదు ... పరుగే ... నీ కోసం వేయికళ్లతో ఆ రోడ్డంతా చూశాను. ప్రతీ చెట్టూ పుట్టా వెతికాను. లేత ఎండలో చెట్లనీడలు సాగుతున్నాయి. కానీ నీనీడైనా లేదు. పిట్ట చెట్లమీంచీ ఎగురుతూ నవ్వాశ్చర్యంగానూ చూస్తున్నాయి. నేను రాలేని, అందుకోలేని చోటికి చేరావని నిరాశతో తిరుగుముఖం పట్టాను.

రోడ్డు చివరంటా వచ్చాక ఎవరిదో పిలుపు. అచ్చం నీ పిలుపులాగే అనిపించింది. వచ్చినంత దూరం ఎంతో ఆశతో ఆనందంతో మళ్లీ వెనక్కి పరిగెట్టుకొచ్చాను. ఎక్కడో నీ గొంతు ... నా కోసం నీ పిలుపు ... కానీ కనిపించవు. ఆనందంతో నవ్వొచ్చింది, కన్నీళ్లొచ్చాయి. కనిపించలేదని ఉద్రేకంతో గొంతు చించుకుని అరిచాను. ఏడ్చాను గొంతు జీరబోయేలా.

ప్రయోజనం లేదు. నా వేదన అరణ్యరోదన ఒక్కలా అనిపించాయి. నా దుర్భర, నిష్టూర లోకంలోంచి మళ్లీ స్వేచ్ఛా వాయువుల కోసం ఈ అనంతానంద సముద్రంలో కలిశావా ... నువ్వు ... ఎంత గొప్పదానివి.

నిజమే, నా చీకటి లోకంలో నా కాన్వాసుపై బోధించి నీ అందాల్నీ ఆనందాన్నీ నాది చేసుకోవాలనే తపన క్షమించరానిదే ...

నీ సౌందర్యాన్ని గీతల్లో మలిచి రూపంలోకి తేవాలనే ఉద్రేకం ఎంత పనిచేసింది!? ఎప్పటికైనా నీ ఆనందాన్నీ ఆంతర్యాన్నీ తెలుసుకునే ధ్యానంలో ఆనంద శిఖరాల్ని అధిరోహించగలనా?